క్లుప్తంగా

రెండు కాడెద్దులు మృతి

మల్దకల్: మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులుకు చెందిన రెండు కాడెద్దులు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రైతు రామాంజనేయులు రోజు మాదిరిగానే ఉదయం వ్యవసాయ పొలానికి కాడెద్దులను తీసుకెళ్లి, సాయంత్రం ఇంటి దగ్గర కట్టేశాడు. తెల్లవారు జామున రెండు ఎద్దులు అచేతన స్థితిలో పడిఉన్నాయి. ఈ విషయాన్ని పశువైద్యాధికారిని యామినిసాయికి సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించగా అప్పటికే కాడెద్దులు మృతిచెందినట్లు తెలిపారు. వైద్యులు శ్యాంపిల్స్‌ను సేకరించినట్లు పశువైద్యాధికారి పేర్కొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

గట్టు: వ్యవసాయ పొలం దగ్గర నిద్రిస్తున్న సమయంలో అకారణంగా దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు మేకల నర్సింహులు, కుటుంబ సభ్యులు మంగళవారం ఎస్పీ సృజనకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని శివారు పొలం వద్ద నిద్రించగా గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు పాత కక్షలతో దాడి చేశారని వివరించారు.

అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

చలువ పందిళ్లు ఏర్పాటు

ధరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థుల కోసం తడకలతో కూడిన చలువ పందిళ్ల వేశారు. సర్పంచు పద్మమ్మ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి సహకరంతో గదుల కొరతతో విద్యార్థులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు చలువ పందిళ్లు వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

గద్వాలన్యూటౌన్: అంబరా టౌన్ షిప్ (రాజీవ్ స్వగృహ) లే అవుట్ అభివృద్ధికి నిధులు మంజూరుపై టౌన్ షిప్ ఫేస్ వన్ లబ్ధిదారుల సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి బొకె అందించి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ టౌన్ షిప్ అభివృద్ధిలో బాగంగా డ్రైయినేజీలు, సీసీ రోడ్లు, వీధిలైట్లు పనులకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అధ్యక్షుడు భీంరెడ్డి, సెక్రటరీ రవిశంకర్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌లతో పాటు పలువురు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

గట్టు తహసీల్దార్‌గా జుబేర్‌మోహిద్దీన్

గట్టు: మండల తహసీల్దార్‌గా జుబేర్ మోహిద్దీన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాదు నుంచి మండల కేంద్రానికి బదిలీ అయిన జుబేర్‌మోహిద్దీన్‌కు డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు మేలు



ధరూరు: బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుడ్డెందొడ్డి, చింతరేవుల, ద్యాగదొడ్డి, నర్సన్‌దొడ్డి, చింతరేవుల, గ్రామాలలో నిర్మిస్తున్న బీసీ, ఎస్సీ మైనార్టీలకు సంబంధించిన మల్టీపర్పస్ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ జంబురామన్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంప్లెక్స్ కూల్చివేతకు నోటీసులు జారీ

అయిజ: పట్టణంలోని రాయచూరు– కర్నూలు రోడ్డు పక్కన నిర్మించిన కాంప్లెక్స్ భవనాలను కూల్చివేయాలని మున్సిపల్ అధికారులు మంగళవారం కాంప్లెక్స్ భవనానికి నోటీసులు అతికించారు. టీపీఓ కుర్మయ్య తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలోని కర్నూలు– రాయచూరు రోడ్డు పక్కన ఆరుగురు రెసిడెన్సియల్ నిర్మాణం కోసం అనుమతులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాంప్లెక్స్ భవనాలను కూల్చివేయాలని నోటీసులు అందజేస్తే తీసుకోలేదని దీంతో భవనాలకు నోటీసులు అతికించామని వివరించారు. యజమానులు భవనాలను కూల్చివేయకుంటే సంబంధిత అధికారులు కాంప్లెక్స్ భవనాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం



అయిజలో బీటీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. మంగళవారం మండలంలోని కోనేరు, లింగనవాయి గ్రామాల్లోని సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. కోనేరు గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డికి సీఎం సహాయ నిధి ద్వారా రూ. 2 లక్షలు, లింగనవాయి గ్రామానికి చెందిన బత్తుల చిన్నరామయ్యకు రూ. 12 వేల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం సహాయ నిధి ద్వారా వేలాది మంది నిరుపేద ప్రాణాలు కాపాడిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, నాయకులు బీచుపల్లి, లక్ష్మణ్, నరసింహ్మా నాయుడు, నర్సన్ గౌడ్, ధనుంజయ్, తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. మానవపాడు మండలం పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన జనార్దన్ రెడ్డికి రూ. 2.25 లక్షలు, ఇటిక్యాల మండలం వీరాపురం గ్రామానికి చెందిన నరేందర్‌కు రూ. 60 వేలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైనట్లు తెలిపారు.

అయిజ: పట్టణంలో చేపట్టిన బీటీ, సీసీ రోడ్డు నిర్మాణం పనులను వేగవంతం చేయాలని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం పట్టణంలో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం పనులను మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, ఏఈ గోపాల్, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని అంతర్గత రోడ్ల పనులను ఎమ్మెల్యే అబ్రహం మంగళవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత లోపించకుండా నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు రేఖ, ఉప సర్పంచు సయ్యద్ రెహ్మాన్, అజయ్, రమణ, నర్సన్ గౌడు, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



పావనంపల్లిలో పాదయాత్ర చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మల్దకల్: కాంగ్రెస్‌తోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దపల్లి, పావనంపల్లి గ్రామాలలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. అలాగే గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బల్గెర నారాయణరెడ్డి, షేక్‌జమాల్, ఇలియాస్, రాజేంద్ర, వెంకటేష్, రఘు, శ్రీకాంత్ గౌడ్, రవినాయుడు, మజీద్, హాజీ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



కరపత్రాలను విడుదల చేస్తున్న చైల్డ్‌లైన్ బృందం సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు

గద్వాల అర్బన్: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని చైల్డ్‌లైన్ బృందం సభ్యుడు జయన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బుర్దపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో చైల్డ్‌లైన్ 1098 బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదామన్నారు. సెల్ ఫోన్ వాడకం వల్ల ఎక్కువ శాతం అనర్థాలు, శారీరక ఎదుగుదల వంటి మార్పులు తలెత్తుతాయన్నారు. పిల్లలు బడికి వెళ్లాలని, ఎవరైనా పనిలో పెట్టుకుంటే 1098కు సమాచారం అందించాలన్నారు. అనంతరం చైల్డ్‌లైన్ అందిస్తున్న సేవలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం



గద్వాలలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



అలంపూర్‌లో..

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో రెడ్ బుక్ డే సందర్భంగా మంగళవారం భారత విప్లవ కెరటం భగత్ సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పపార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడుతూ కమ్యూనిస్టు ప్రణాళిక రూపొందించి ప్రపంచానికి పరిచయం చేసిన సందర్భంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి 21న రెడ్ బుక్ డేగా నిర్వహిస్తున్నామన్నారు. భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వీవీ నర్సింహ్మా, రాజు, విజయ్ కుమార్, ఆంజనేయులు, సవారన్న ఉన్నారు.

అలంపూర్: మహనీయుడు భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో రెడ్ బుక్ డేను సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాజు మాట్లాడుతూ 1948 ఫిబ్రవరి 21వ తేదీన కమ్యూనిస్టు ప్రణాళికను ప్రవేశపెట్టారన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నరసింహ్మ, నాయకులు అయ్యప్ప, నాగరాజు, వెంకటస్వామి, సిద్దయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో..



నందిన్నెలో వ్యాసరచన పోటీలో విద్యార్థులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి, ఆచారాలను మరిచిపోవొద్దన్నారు. మాతృమూర్తికి ఎంత గౌరవం ఇస్తామో మాతృభాషకు కూడా ప్రతి ఒక్కరూ అంతే గౌరవం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించడం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్‌రావు, సంధ్య, నందిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె రాఘవేంద్ర పాఠశాలలోని మంగళవారం అంతర్జాతీయ తెలుగు భాష దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేంద్ర, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన

గట్టు: మండల కేంద్రంలో బీసీ, మైనార్టీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం మంగళవారం సంత బజారు, మసీదుల దగ్గర ఖాళీ స్థలాలను బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. అదేవిధంగా గంగిమాన్‌దొడ్డిలో స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటికే ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి నిధులను మంజూరు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ వాహాబ్, నాయకులు రామునాయుడు, బజారి, వెంకటేష్, వీరారెడ్డి, బజారి, ఆంజనేయులు, నవీన్‌చారి, నర్సింహులు, తిమ్మప్ప, వెంకటన్న పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

మానవపాడు: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రిజ్వాన్ తాన్వీర్ అన్నారు. మంగళవారం మండలంలోని అమరవాయిలో రెండో రోజు కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 132 మందికి కంటి పరీక్షలను నిర్వహించామని వారిలో 40 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేశామని, 58 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాల కోసం పంపించామన్నారు. కార్యక్రమంలో క్యాంపు మెడికల్ ఆఫీసర్ వీనాశ్రీ, ఎంపీహెచ్‌ఓ సత్యానారాయణ, రుబీనా, షాజహన్, మాబమ్మ, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి

గద్వాల రూరల్: రెవెన్యూశాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులను ప్రభుత్వం ఇతర శాఖలలో విలీనం చేయడంతో తమపై పనిభారం పడిందని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసు జిల్లా అసోసియేషన్ సభ్యులు మంగళవారం రాత్రి కలెక్టర్ వల్లూరు క్రాంతి వినతిపత్రం అందజేశారు. ఆదాయ, కుల, స్థానికత, ఫ్యామిలీ మెంబర్ వంటి ధృవీకరణ పత్రాల జారీ, జనన, మరణ ధ్రువ పత్రాలు, కల్యాణలక్ష్మి, షాదీముభారక్, ప్రకృతివైపరీత్యాలు, ప్రొటోకాల్, డబుల్‌బెడ్రూం వంటి పథకాల పనికి సంబంధించి ఉద్యోగులపై అధిక పనిభారం పడుతుందని వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సంఘం ఉద్యోగులు మదన్‌మోహన్, వీరభద్రప్ప, వెంకటేష్, సుభాష్‌నాయుడు, సత్యనారాయణరెడ్డి, సుబ్రమణ్యం, అజిత్, కరుణాకర్, యల్లయ్య, నర్సింహులు, పాల్గొన్నారు.

కారు టైర్లు పేలి నలుగురికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి కర్నూలు కారులో ఫాదర్ విజయసాగర్, భార్య ప్రయాణిస్తున్నారు. అలంపూర్ చౌరస్తా ఉత్తర ఫుడ్స్ ఎదురుగా కారు ముందు టైర్లు పేలాయి. దీంతో కారు అదుపుతప్పి ముందున్న ఆటోను ఢీకొన్నది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని ఎస్ఐ తెలిపారు.

టీఎస్‌పీఈజేఏసీ కమిటీ ఎన్నిక



గద్వాల అర్బన్: విద్యుత్ ఉద్యోగులకు గతేడాది ఏప్రిల్ నుంచి అమలు చేయాల్సిన పీఆర్‌సీని ఇప్పటి వరకు అమలు చేయకుండా మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యం వహిస్తోందని టీఎస్‌పీఈజేఏసీ కమిటీ నాయకులు అన్నారు. నేటి (బుధవారం) నుంచి మార్చి 24వ తేదీ వరకు విద్యుత్ ఉద్యోగుల నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా రామకృష్ణ, కన్వీనర్ శ్రీనివాసులు, కో చైర్మన్ అశోక్, కో కన్వీనర్ భాస్కర్, వైస్ చైర్మన్ నవీన్ బాబులు ఎన్నికయ్యారు.

రోడ్డు పనుల అడ్డగింత



అయిజ: భారతమాల రోడ్డు నిర్మాణం పనులను వివిధ మండలాల రైతులు మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులో మంగళవారం అడ్డుకున్నారు. భారత మాల రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుంచి సేకరించిన భూములకు చెల్లిస్తున్న నష్ట పరిహారం చాలా తక్కువగా ఉందని, దానివలన నిర్వాసితులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.

మంత్రి, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల–2 గ్రామంలో రేణుక ఎల్లమ్మ, సవారమ్మ ఆలయాల ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే అబ్రహం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ రవి ప్రకాష్ గౌడ్, రైతు సంఘం సభ్యులు సురేష్ గౌడ్, మల్లికార్జున్, ఎంపీటీసీ కురుమూర్తి, పాల్గొన్నారు.

బృహత్ ప్రకృతి వనానికి నిప్పు

మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కనే ఉన్న బృహత్ పల్లె ప్రకృతి వనానకి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు అంటించారు. స్థానికుల వివరాల ప్రకారం మధ్యాహ్న సమయంలో కోల్డ్‌స్టోరెజ్ గోదామ్ వెనుక వైపు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగారని తెలిపారు. వారు మద్యం మత్తులో సిగరేట్ కాల్చి ప్రకృతి వనంపై వేయడంతో మంటలు చెలరేగాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్ పరీశీలనకు వచ్చిన ఇంటర్ నోడల్ ఆఫీసర్ హృదయరాజ్ స్పందించి వెంటనే ఫైర్‌ఇంజన్‌కు ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటాలను ఆర్పారు.అప్పటికే చాలా మొక్కలు కాలి బూడిద అయ్యాయి. ఉన్నతాధికారులు విచారణ చేసి మందుబాబులను గుర్తించి శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

రైతులకు అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతు వేదికలో మంగళవారం నానో యూరియా వాడకంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సదర్భంగా ఏఈఓ భరత్ మాట్లాడుతూ నానో యూరియా వల్ల కలిగే లాభాలను వివరించారు. దీంతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు. మొక్కలకు ఎక్కువ శాతంలో నత్రజని అందుతుందన్నారు. యూరియా బస్తా కంటే తక్కువ ధరలో లభిస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అలంపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మోహన్‌రెడ్డి, సువర్ణమ్మ

అలంపూర్: నిబంధనల మేరకు పప్పుశనగ కొనుగోళ్లు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్‌పర్సన్ సువర్ణమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పప్పుశనగ కొనుగోళ్ల కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో కొనుగోళ్ల నిబంధనలు ఖరారు అవుతాయని తెలిపారు. ధాన్యం తీసుకొచ్చే రైతులు నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. ఒక రైతు నుంచి రోజుకు 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు చేయడం జరుగుతుందన్నారు. కేంద్రంలో క్వింటాల్‌కు రూ.5335 మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాతూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి కేశవరెడ్డి, మార్కెట్ యార్డు ఇన్‌చార్జ్ కార్యదర్శి అనిల్ కుమార్ ఉన్నారు.

అయిజ: పట్టణంలోని మార్కెట్ సబ్ యార్డ్‌లో పప్పుశనగల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సింగిల్‌విండో ప్రసిడెంట్ మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పుశనగ మద్దతు ధర రూ. 5,335లు ప్రకటించిందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈఓ మల్లేష్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆగడాలకు అడ్డుకట్ట వేద్దాం



తాటికుంటలో ప్రచారం చేస్తున్న రామచంద్రారెడ్డి

మల్దకల్: బీఆర్‌ఎస్ ఆగడాలకు అడ్డుకట్ట వేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా విఠలాపురం, ఎల్కూరు, పాల్వాయి, తాటికుంట, కుర్తిరావల్ చెరువు, మల్దకల్ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఓటర్లను బీజేపీ నాయకులు ఆయన కలిశారు. బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత కల్పించాలని ఉపాధ్యాయ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బండ్ల వెంకట్రాములు, వెంకటేష్, ప్రదీప్, లక్ష్మణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పాగుంటలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మురళీ ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా గడ్డం కృష్ణారెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్ఠతకు కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహనంది రెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, పద్మారెడ్డి, గోవిందు, నర్సిరెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మీర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం రాత్రి పెంచికలపాడులో బీజేపీ భరోసా యాత్రలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, మహేష్‌బాబు, అహ్మద్‌అలీ, హనుమంతు,వెంకటేష్ పాల్గొన్నారు.

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులతోనే తెలంగాణలో ప్రగతి సాధిస్తుందని బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు బంగి లక్ష్మన్న అన్నారు. వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్‌లో మంగళవారం ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సులో మండల అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. ఆర్డీఎస్ కెనాల్ వద్ద కుర్చీ వేసుకుని కూర్చుని నీరు పారిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి పంటలు ఎండుతుంటే ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. భీంసేన్‌రావ్, ఓబీసీ అయ్యరాజు, ప్రధాన కార్యదర్శి బీకే శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మనోరమ

అలంపూర్: అంగన్‌వాడీల్లో చదువుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. మంగళవారం పట్టణంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మతో కలిసి ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం నుంచి అందిస్తున్న పోషక పదార్థాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల బరువు, ఎత్తు రిజిస్టర్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలన్నారు. గ్రామీణ స్త్రీలకు, బాలింతలకు పౌష్టిక ఆహారం ఆవశ్యకత, ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ అక్బర్‌పేటలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వీరితోపాటు అంగన్‌వాడీ టీచర్ మాధవి. ఆయా రజీయాబీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సామ్యెల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

గద్వాలన్యూటౌన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బహుజన క్లాస్ టీచర్ అసోసియేషన్ (బీసీటీఏ) అభ్యర్థి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు నాలుగేళ్లుగా పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదన్నారు. గురుకులాలు, కేజీబీవీలు సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. సమావేశంలో కృష్ణుడు, ఉపాధ్యక్షుడు ఎంఎస్ విజయ్‌కుమార్, కృష్ణ, వెంకటేష్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అస్తవ్యస్త రహదారుల మధ్యే ‘దేవుడి’ సేవలు



పురవీధులలో మాంసం విక్రయాలు

- ముందస్తుగా విన్నవించినా పట్టించుకోని పాలకులు

జోగుళాంబ శక్తిపీఠం: పవిత్ర పుణ్యక్షేత్రం ఐదో శక్తిపీఠం జోగులాంబ అమ్మవారి సేవకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. పేరు గొప్ప ఊరు దిబ్బలా పాలకుల తీరు ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. పురువీధుల గుండా ఎంతో పవిత్ర మనస్సుతో అమ్మవారి, స్వామివారి సేవలో భక్తులు నిమగ్నమవుతారు. వివిధ సేవలలో భాగంగా పురవీధులగుండా భక్తి శ్రద్ధలతో ఊరేగిస్తారు. కాని పాలకుల అలసత్వం కారణంగా పురవీధుల గుండా ఊరేగిస్తుండగా అడుగడుగునా గుంతలు, మాంసపు దుకాణాలు దర్శనమిస్తున్నాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అన్ని శాఖల అధికారులతో ముందస్తు సమీక్ష సమావేశాలు నిర్వహించినా ఫలితం లేదు. పురవీధులలో మాంసం విక్రయాలు కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ చైర్మన్ దృష్టికి భక్తులు తీసుకెళ్లినా చర్యలు చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రతీరోజు ఉదయం సాయంత్రం పురవీధుల గుండా భగవంతుడి వాహన సేవలు గుంతలమయ రహదారులు, మురికి నీరు ప్రవహించే దారులగుండా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పాలకులు, ఆలయ నిర్వాహకులు చొరవ తీసుకొని మురుగు గుంతలను పూడ్చాలని భక్తులు కోరుతున్నారు.